క్లుప్తంగా

ఎన్టీపీసీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు

పరవాడ: మండలంలో వాడచీపురుపల్లి శివారు పోలిరెడ్డిపాలెం తారకరామ కాలనీలో ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే శివారు గ్రామం పోలిరెడ్డిపాలెం ప్రజలకు అనేక విధాల సౌకర్యంగా ఉంటుందని, నిధులు మంజూరు చేసిన ఎన్టీపీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శివలంక లక్ష్మి, ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీను, స్థానిక నాయకులు కూండ్రపు అప్పారావు, రమణమూర్తి పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ కార్యదర్శి నియామకానికి దరఖాస్తులు

పరవాడ: ప్రస్తుత(2025–26), రానున్న (2026–27) విద్యా సంవత్సరానికి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నియామకం కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 58 ఏళ్లలోపు వయసున్న స్కూల్ అసిస్టెంట్లు(పీడీ, పీఈటీ)లో కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు ఈ నెల 31లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావును సంప్రదించాలని సూచించారు.

లండ వెంకటరమణ పార్థివ దేహానికి నివాళులు



వెంకటరమణ పార్థివ దేహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

సింహాచలం: రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ మృతిచెందిన అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పూజారి లండ వెంకటరమణ పార్థివ దేహానికి బుధవారం వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. లండ వెంకటరమణ పార్థివ దేహాన్ని వారి ఆచారం ప్రకారం ఖననం చేశారు. అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, నాయకులు కర్రి సత్తిబాబు, బొట్టా శ్రీను తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రొటీన్ పౌడర్ అందజేత



ప్రొటీన్‌పౌడర్, ఐరన్ సిరప్‌లు అందిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ

అగనంపూడి: విశాఖ రోటరీ క్లబ్ సౌత్ ఆధ్వర్యంలో అగనంపూడి ఏరియా ఆస్పత్రిలోని 100 మంది గర్భిణులకు ప్రొటీన్ పౌడర్, ఐరన్ సిరప్‌లు అందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ మాట్లాడుతూ ప్రతీ నెలా అగనంపూడి ఆస్పత్రిలో రోగులకు ప్రొటీన్ పౌడర్ పంపిణీ చేసేందుకు రోటరీ క్లబ్ ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు వి.శివకుమార్ మాట్లాడుతూ రొటేరియన్ ఆర్.వి.రాజశేఖర్ సౌజన్యంతో సమకూర్చినట్టు చెప్పారు. గర్భిణులు పౌష్టికాహార లోపంతో ప్రసవన సమయంలో పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు ఉమామహేశ్వర్‌రెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, అట్లూరి రమేష్, పి.ప్రభాకరరావు, జోగారావు, బోరా కుమార్‌రెడ్డి, బి.కొండలరావు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి వితరణ

అగనంపూడి: విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అశ్రిత క్లబ్ సేవా విభాగం ఆధ్వర్యంలో నగరంలోని ఆనంద్ మార్గ్ అనాథాశ్రమానికి అవసరమైన వస్తువులను విద్యార్థులు అందించారు. అనాథాశ్రమానికి వెళ్లి అక్కడి పిల్లలతో ముచ్చటించారు. రొట్టెల తయారీ యంత్రం, రెండు ప్రెజర్ కుక్కర్లు, ఇండక్షన్ స్టౌ, ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్, దుస్తులు ఉతుక్కోడానికి సంవత్సరానికి సరిపడా సబ్బులు, వాషింగ్ పౌడర్, కొబ్బరి నూనె సీసాలుఅందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.వసంతరాణి, బి.సుధా మాధురి, పి.వాసంతి, సంతోష్ విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో.. వసతి కష్టాలు!



ప్రస్తుతం అందుబాటులో ఉన్న గజపతి సత్రం

సింహగిరిపై వసతి కోసం భక్తులు తిప్పలు పడాల్సి వస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొండపై కనీసం ఒక్క రోజైనా బస చేసి, ఆధ్యాత్మిక సంతృప్తి పొందుదామంటే అందుకు వీల్లేని దుస్థితి. ఇక్కడ సామాన్య భక్తులకు అందుబాటు ధరలో ఉన్నది దేవస్థానానికి చెందిన గజపతి సత్రం మాత్రమే. అది కూడా వారాంతపు రోజులు, పర్వదినాలు, పెళ్లిళ్ల సమయంలో దొరకని పరిస్థితి. దీంతో ప్రైవేట్ హోటళ్లు, లాడ్జీల్లో బస చేసి, చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తోందని భక్తులు వాపోతున్నారు.

- అందుబాటులో ఉన్నది గజపతి సత్రం ఒక్కటే
- పెళ్లిళ్లు, ఉత్సవాలు, యాత్రా దినాల్లో గజపతి సత్రం ఫుల్
- వీఐపీలకూ దొరకని వీఐపీ కాటేజీలు
- మరుగున పడ్డ డొనార్స్ కాటేజీ ప్రణాళిక



వీఐపీల కోసం నిర్మించిన ప్రహ్లాద కాటేజీ



వీఐపీల సింహవల్లీ, రమణారెడ్డి కాటేజీలు

సింహాచలం: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో ఒకటి సింహగిరి పైనున్న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయం. స్వామి దర్శనానికి రోజూ వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. వీరిలో కుటుంబ సమేతంగా వచ్చే దూర ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువ. సింహగిరికి చేరుకున్నాక తాత్కాలిక బసకు గదులు దొరకడం గగనమైపోయింది. దీనికి కారణం సరిపడా కాటేజీలు సింహగిరిపై లేకపోవడమే..! సింహగిరిపై భక్తులకు సరిపడా వసతి కల్పించాలని ఇటీవల ఆలయానికి రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి కూడా పలువురు తీసుకెళ్లారు.

గజపతి సత్రం ఒక్కటే దిక్కు

సింహగిరిపై ప్రస్తుతం గజపతిసత్రం ఒక్కటే భక్తుల వసతికి అందుబాటులో ఉంది. రెండు అంతస్తుల్లో ఉన్న ఈ సత్రంలో 24 ఏసీ, 24 నాన్ ఏసీ గదులున్నాయి. జీఎస్టీతో కలిపి ఏసీ అయితే రూ.1,008, నాన్ ఏసీ అయితే రూ.560 చెల్లించాలి. శని, ఆదివారాలు, యాత్రా రోజులు, పెళ్లిళ్ల సీజన్లలో ముందుగా బుక్ చేసుకునేవి ఈ గదులే. దీంతో సామాన్య భక్తులకు గదులు లభించడం కష్టతరమవుతోంది. గంటల తరబడి నిరీక్షించినా ఫలితంలేక నిరాశగా వెనుదిరగాల్సి వస్తోందని భక్తులు తరచూ వాపోతున్నారు.

వీఐపీ కాటేజీల పరిస్థితీ అంతే..

సింహగిరిపై ఉన్న వీఐపీ కాటేజీల పరిస్థితి కూడా దాదాపు అంతే. ప్రస్తుతం వీఐపీ కేటగిరీకి చెందిన ప్రహ్లాద, సింహవల్లీ, రమణారెడ్డి, అన్నపూర్ణ, వీబీసీ కాటేజీలు సింహగిరిపై ఉన్నాయి. ప్రహ్లాద కాటేజీలో మూడు సూట్ రూమ్‌లకు కలిపి అద్దె రూ.3,920. సింహవల్లీ, రమణారెడ్డి కాటేజీల్లో రెండేసి సూట్లు ఉండగా, ఒక్కో సూట్‌కు రూ.1120, అన్నపూర్ణ, వీబీసీలో రెండేసి సూట్‌లుండగా ఒక్కో సూట్‌కు రూ.2,800 చెల్లించాలి. కొంచెం ఆర్థిక స్తోమత కలిగిన వారు ఆ కాటేజీల్లో బస చేద్దామంటే సవాలక్ష నిబంధనలు సతాయిస్తాయి. ఆ సమయానికి మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలు, ఉన్నతాధికారుల బస చేయకపోతే, వారి సిఫార్సుతో మరెవరూ లేకపోతే తప్ప ఆ కాటేజీలు లభించవు.

మరుగున పడ్డ డొనార్స్ కాటేజీ ప్రణాళిక

సింహగిరిపై సాధారణ భక్తులకు, వీఐపీలకు అందుబాటులో ఉండేలా డొనార్స్ కాటేజీ నిర్మాణానికి 2008లో ప్రణాళిక చేశారు. మైక్రోటవర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న కొండపై వీఐపీ కాటేజీల నిర్మాణానికి అప్పటి ఈవో, ప్రస్తుత దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సంకల్పించారు. డొనార్స్ కాటేజీ నిర్మాణానికి కొండపై కొంతమేర స్థలాన్ని చదును చేశారు. రామచంద్రమోహన్ బంధువే తొలి విరాళాన్ని అందించారు. ఒక్కో డొనార్‌కు ఒక్కో గది పేరు పెట్టి ఏడాదిలో నెల రోజులు వారికి ఉచితంగా ఆ గదిని ఇచ్చేందుకు నిర్ణయించారు. కానీ కొన్ని రోజులకే ఆ ప్రణాళిక మరుగున పడింది.

ఉత్సవ రోజుల్లో బుకింగ్ బంద్

సింహగిరిపై జరిగే చందనోత్సవం, వార్షిక కల్యాణోత్సవం, గిరి ప్రదక్షిణ, ముక్కోటి ఏకాదశి తదితర ప్రముఖ ఉత్సవాల రోజుల్లోనైతే భక్తులు బస కోసం ఆశలు వదులుకోవాల్సిందే. ఆయా రోజుల్లో దేవస్థానమే ముందుగా గజపతిసత్రంలోని గదులను అద్దెకు కేటాయించే ప్రక్రియని నిలిపేస్తుంది. ఆ రోజుల్లో విధులకు హాజరయ్యే పలు ప్రభుత్వ సంస్థల సిబ్బందికి, ఇతరత్రా అవసరాలకు ఆ గదులను కేటాయిస్తుంది.

వెనుదిరుగుతున్న పరిస్థితి



నేను తరచూ భక్తుల్ని ఇక్కడికి తీసుకొస్తుంటాను. ఎక్కువగా ఒడిశా భక్తులు వస్తుంటారు. కనీసం ఒక రోజైనా సింహగిరిపై ఉండాలనుకుంటారు. బస దొరక్కపోవడంతో వెనుదిరుగుతున్నారు. యాత్రా దినాల్లో చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– **చలపతి,** క్యాబ్ డ్రైవర్, బుడితి, శ్రీకాకుళం జిల్లా

వసతి సౌకర్యం పెంచాలి



ఉత్తరాంధ్రలో ఎంతో పెద్ద క్షేత్రం అయిన సింహాచలానికి వచ్చే భక్తులకు వసతి సౌకర్యం పెంచాల్సిన బాధ్యత దేవస్థానం అధికారులపై ఉంది. ముఖ్యంగా కనీసం ఒకరోజైనా ఇక్కడ ఉండేలా వసతి సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలి.

– **రవితేజ,** పార్వతీపురం

దివ్యాంగ బాలలకు వరం.. భవిత కేంద్రం



భవిత కేంద్ర బాలలు, తల్లిదండ్రులతో అనకాపల్లి జిల్లా సహితవిద్య సమన్వయకర్త కృష్ణంనాయుడు

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, విద్యాభివృద్ధి పథకాలను భవిత కేంద్ర బాలలు సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి జిల్లా సహితవిద్య సమన్వయకర్త బీఆర్‌వీఆర్ కృష్ణంనాయుడు సూచించారు. స్థానిక భవిత కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించి బాలల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల అవగాహన సదస్సులో మాట్లాడుతూ తల్లిదండ్రుల భాగస్వామ్యం విద్యార్థుల ప్రగతికి ఎంతో కీలకమన్నారు. సమగ్ర శిక్ష పథకం ద్వారా భవిత కేంద్రంలో అందిస్తున్న డిజిటల్ లెర్నింగ్, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్, ప్రత్యేక శిక్షణ, ఎస్ఎస్ఏ ద్వారా ట్రాన్స్‌పోర్టు, రీడర్ అలవెన్స్, ఎస్కార్ట్, హోమ్‌బేస్ట్ అలవెన్స్, ఫిజియోథెరపీ సేవలను వివరించారు. ది లూమోస్ స్టోర్ కంపెనీ వ్యవస్థాపకులు తమ మొదటి లాభం నుంచి దివ్యాంగ బాలలకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో లూమోస్ స్టోర్ ఫౌండర్లు వి.కృష్ణవంశీ, వి.రాజశేఖర్, వై.ఉమామణిదీప్, టి.పవన్‌కుమార్, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, అక్షింతలు, ప్రసాదం అందించారు.

అధినేతతో నియోజకవర్గ నేతల భేటీ



అధినేత జగన్‌తో అదీప్‌రాజ్, పైలా శ్రీనివాసరావు, శరగడం చినఅప్పలనాయుడు, గండి రవికుమార్

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ముఖ్య నేతలు బుధవారం కలుసుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, మాజీ జిల్లా అధ్యక్షుడు శరగడం చినఅప్పలనాయుడు, పార్టీ సీనియర్ నేత గండి రవికుమార్ అధినేతతో భేటీ అయ్యారు. నియోజకవర్గంలోని పలు అంశాలపై వైఎస్ జగన్‌తో అదీప్‌రాజ్ చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ ప్రగతిని వివరించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ.. పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా వైఎస్ జగన్ సూచించారని నాయకులు తెలిపారు.

ప్రజారోగ్యాన్ని కాపాడాల్సింది ప్రభుత్వాలే..

- మూఢ నమ్మకాలతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు
- నెల్లూరు జీఎంసీ ప్రొఫెసర్ కాలేషా సాహెబ్



మాట్లాడుతున్న డాక్టర్ కాలేషా సాహెబ్

పెందుర్తి: దేశంలో ప్రజారోగ్యం తీవ్రమైన గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందని, మూఢ నమ్మకాలను అధిక శాతం నమ్మడం వలనే ఇలాంటి దుస్థితి నెలకొందని నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌కే కాలేషా సాహెబ్ అన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందని స్పష్టం చేశారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్త్ సినారియో ఇన్ ఇండియా అనే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో శాస్త్రీయ పద్ధతిలో కాకుండా మూఢనమ్మకాలు, చాందస భావాలతో కొందరు వ్యక్తులతో పాటు ప్రభుత్వాలు కూడా ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నాయని ఆక్షేపించారు. మూఢ నమ్మకాలను సమూలంగా నిర్మూలించే దిశగా, శాస్త్రీయ పద్ధతిలో ప్రజారోగ్యం బాగుచేసే కోణంలో ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళీధర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, జేవీవీ ప్రతినిధులు ఎల్.కృష్ణారావు, ప్రసాద్, పరశురాం, శేషగిరిరావు, రమణ శర్మ, ప్రసాద్, వాసుదేవరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి అంబులెన్స్ వితరణ



అంబులెన్స్ ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

పరవాడ: నర్సీపట్నం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం రూ.35 లక్షల వ్యయంతో సమకూర్చిన అంబులెన్స్‌ను శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌లు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ కలిగిన అంబులెన్స్ సేవలను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి యాజమాన్యం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంబులెన్స్‌ను ఆస్పత్రికి సమకూర్చిన ఎన్టీపీసీ యాజమాన్యాన్ని అభినందించారు. రోగులకు అవసరమయ్యే సదుపాయాలు ఈ అంబులెన్స్‌లో ఏర్పాటు చేసినట్లు ఎన్టీపీసీ అధికారులు తెలిపారు. ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ద్వారా ముున్ముందు ప్రజోపయోగ కార్యక్రమాలు మరిన్ని చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ సింహాద్రి సీనియర్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

భూదేవి చెరువు గర్భంలోని చెట్ల వేలం వాయిదా



వేలం పాటను అడ్డుకునేందుకు పోలీసులతో వివాదానికి దిగిన ఆయకట్టు రైతులు



ముందుగా రైతులతో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ చైతన్య తదితరులు

- ఆయకట్టు రైతులు, పోలీసులకు మధ్య వాగ్వాదం
- వచ్చే నెల 13కు వాయిదా వేసిన ఈవోపీఆర్డీ చైతన్య

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం గ్రామ రెవెన్యూ పరిధి భూదేవి చెరువు గర్భంలోని కలప సేకరణకు గ్రామంలో నిర్వహించిన బహిరంగ వేలం వివాదానికి దారితీసింది. చెరువు గర్భంలోని సుమారు 12 ఎకరాల్లో ఉన్న సరుగుడు తోటకు పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన వేలం ప్రక్రియను చెరువు ఆయకట్టు రైతులు, సాగు నీటి సంఘాల సభ్యులు అడ్డుకున్నారు. పోలీసులు రంగప్రవేశం చేయడంతో పోలీసులకు, ఆయకట్టు రైతులకు మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. రైతులు తీవ్రంగా ప్రతిఘటించడంతో వేలాన్ని వాయిదా వేస్తూ వచ్చే నెల 13న నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్డీ చైతన్య ప్రకటించారు.

మండలంలో అతిపెద్దదైన భూదేవి చెరువు అయ్యన్నపాలెంలో 135.9 ఎకరాల్లో విస్తరించి ఉంది. అయ్యన్నపాలెం, మర్రిపాలెం, ఎల్లుప్పి, గుల్లేపల్లికి చెందిన సమారు 500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరిస్తుంది. చెరువు ఆదాయం అయ్యన్నపాలేనికి రెండొంతులు, బోదువలస శివారు మర్రిపాలేనికి ఒక వంతుగా పూర్వీకుల నుంచి వస్తోంది. చెరువు గర్భంలో సామాజిక అటవీశాఖ అధికారులు 12 ఎకరాల్లో సరుగుడు, నీటగిరి, మద్ది, టేకు వంటి చెట్లను నాటారు. కేవలం సరుగుడు తోట విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.50 లక్షల వరకూ ఉంటుందని అంచనా. ఈ ఆదాయాన్ని అయ్యన్నపాలెం పంచాయతీకి మాత్రమే జమ చేయడం సమంజసం కాదంటూ ఆయకట్టు రైతులు అడ్డుకోవడంతో వివాదం నెలకొంది. వేలం పాటను అడ్డుకున్న వారిలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు భార్య తుంపాల పార్వతి, తుంపాల శివ, సాగునీటి సంఘం సభ్యులు కనక చంద్రశేఖర్, బలిరెడ్డి చంద్రరావు, కర్రి రాంబాబు, దొగ్గ రామకృష్ణ, అమరపిన్ని నరసింగరరావు, బంధం అప్పలస్వామి ఉన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



శ్యామ్ మాజీ

పరవాడ: లంకెలపాలెం గ్రామం దాసరి వీధిలో నివసిస్తున్న మతి స్థిమితం లేని శ్యామ్ మాజీ(45) ఈ నెల 22న ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదని అతని బంధువులు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఒడిశా రాయగడకు చెందిన శ్యామ్ మాజీ లంకెలపాలెం దాసరి వీధిలో నివసిస్తున్నాడు. గత కొంతకాలంగా ఆయనకు మతి స్థిమితం లేదు. ఈ నేపథ్యంలో 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బంధువులు పోలీసులనాశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ మల్లికార్జునరావు చెప్పారు.

ఆలయ పునర్నిర్మాణానికి 'రామ సేవా సేన' ఏర్పాటు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలసలో సీతారాముల ఆలయ పునర్నిర్మాణానికి 'రామ సేవ సేన' ఏర్పాటైంది. గ్రామ నాయకుడు పట్టా రామ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలని తీర్మానం చేశారు.

విద్యార్థుల సేవలో 'అక్షర భారతి'

- 15 ఏళ్లుగా ఏటా వేలాది మందికి నోట్ పుస్తకాల వితరణ
- టెన్త్‌లో మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం
- ఈ ఏడాది 3300 మంది పేద విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



ఇటీవల పంపిణీ చేసిన పుస్తకాలతో జేసీబీ ప్రసాద్



విద్యార్థులకు అందించే పుస్తకాల్ని చూపుతున్న టీచర్లు

పెందుర్తి: విద్య నేర్చుకోవడం ఓ వరం.. ఆ విద్యను నేర్చుకునేందుకు చేయూతనివ్వడం పుణ్యకార్యం.. అని పెద్దలు చెబుతుంటారు. ప్రతిభ ఉండి చిన్నచిన్న కారణాలతో ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నా నిరుపేద కుటుంబాల పిల్లలకు నోట్ పుస్తకాలు భారం అవుతున్నాయి. అలాంటి వారికి ఏటా అండగా నిలుస్తోంది పెందుర్తిలోని 'అక్షర భారతి చారిటబుల్ ట్రస్ట్'.

పదిహేనేళ్లుగా..

సరిపల్లికి చెందిన నెల్లూరు ప్రసాద్(జేసీబీ ప్రసాద్) తన సంపాదనలో కొంత భాగాన్ని వెచ్చించి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు సమకూర్చుతున్నారు. 15 ఏళ్లుగా క్రమం తప్పకుండా విద్యా సంవత్సరం ప్రారంభంలో మండల పరిధిలోని అన్ని స్కూళ్ల విద్యార్థులకు వీటిని అందిస్తున్నారు. ఈ ఏడాది కూడా పెందుర్తిలోని 30, దేవరాపల్లిలోని 4 స్కూళ్లలోని 3,300 మందికి నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి అందించి చదువుకునే పేద పిల్లల పట్ల తన మమకారాన్ని చాటుకున్నారు.

అడుగడుగునా ప్రోత్సాహం

పేద విద్యార్థులకు సేవ చేయాలన్న సంకల్పంతో 2010లో అక్షర భారతి ట్రస్ట్‌ను ప్రారంభించారు. నాటి నుంచీ ఏటా వేలాది మందికి నోట్ పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు వంటివి సమకూర్చుతున్నారు. దాంతో పాటు పెందుర్తి మండల స్థాయిలో టెన్త్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఈ ఏడాది కూడా స్వాతంత్య్ర దినోత్సవాన మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

చదువుతోనే పేదరికం నుంచి విముక్తి



నా చిన్నతనం నుంచి చాలా మంది పిల్లలు చిన్న చిన్న అవసరాలు తీరక చదువుకు దూరం అయిన సందర్భాలు చూశాను. కనీసం నా ప్రాంతంలోనైనా అలాంటి పరిస్థితి ఉండకూడదన్న సంకల్పంతో అక్షర భారతి ట్రస్ట్ ప్రారంభించి పేద పిల్లలకు బుక్స్, స్టేషనరీ అందిస్తున్నా. టెన్త్‌లో మంచి మార్కులు సాధించినవారికి నగదు ప్రోత్సాహకాలు ఇస్తున్నా. రానున్న రోజుల్లో ట్రస్ట్ సేవలు మరింత విస్తృతం చేస్తా.

– **నెల్లూరు(జేసీబీ) ప్రసాద్**